
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 10 జులై 2025





నకిలీ మకిలీ

తప్పుడు సర్టిఫికెట్లతో ఏఎన్ఎంల ఉద్యోగాలు

పదోన్నతులు, బదిలీల సమయంలో వెలుగులోకి..

లిస్టులో దాదాపు 30 మంది.. 9 మందివి నకిలీ అని నిర్ధారణ

కమిషనరుకు ఫిర్యాదు చేస్తానన్న డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో కొందరు యాక్సిలరీ నర్స్ మిడ్‌వైఫ్ (ఏఎన్ఎం)లు ఉద్యోగాలు చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకరిద్దరు కాదు.. దాదాపు 30 మంది ఇలా దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్టు సమాచారం. ఇటీవల ఏఎన్ఎంలకు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్ఏ) ఫీమేల్ గ్రేడ్-2 పదోన్నతులు కల్పించిన సమయంలో ఈ విషయం బయటపడింది. పదోన్నతుల సమయంలో సర్టిఫికెట్ల పరిశీలనలో 16 మంది ఏఎన్ఎంల సర్టిఫికెట్లు నకిలీవని గుర్తించారు. ప్రైవేట్ నర్సింగ్, ఒకేషనల్ నర్సింగ్ కళాశాలల్లో శిక్షణ పొందినట్టు వీరు సర్టిఫికెట్లను చూపగా, అవి నిజమో కాదోనని డీఎంహెచ్‌వో విచారణకు పంపారు. ఈ విచారణలో ఆ సర్టిఫికెట్లలో కొన్ని నకిలీవని నిర్ధారణైంది. దీంతో వీరికి పదోన్నతులు లభించలేదు. పారా మెడికల్ బోర్డు సైతం ఇవి నిజమైన సర్టిఫికెట్లుగా ధ్రువీకరించలేదు. మొదటి వెరిఫికేషన్‌లోనే 9 మందివి నకిలీ సర్టిఫికెట్లని తేలింది. మిగిలిన ఏడుగురు.. మచిలీపట్నం, అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిక్షణ పొందామని చెప్పగా, విచారణకు డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశించినట్టు తెలుస్తోంది. మరికొన్ని నకిలీ సర్టిఫికెట్లు మిగతా 6లో..

నకిలీపై ఆరా

జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేసే వారిపై వైద్య ఆరోగ్య శాఖతో పాటు మరి కొన్ని శాఖల అధికారులు ఆరా తీస్తున్నారు. దాదాపు 15 ఏళ్లపాటు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేసి అక్రమంగా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన వారి వివరాలను బయటకు తీస్తున్నారు.



ప్రకృతిమాతకు పచ్చలహారం

ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు రెండోరోజు బుధవారం కూడా ఘనంగా జరిగాయి. దుర్గమ్మ మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణాన్ని పచ్చగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. మూడోరోజైన గురువారం మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. 6



కృష్ణమ్మ దరికి గోదారి

- ప్రకాశం బ్యారేజీ వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- కృష్ణాడెల్టా రైతుల మోముల్లో ఆనందం

పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలోకి చేరిన గోదావరి జలాలు

పట్టిసీమ నుంచి 5,600 క్యూసెక్కుల నీరు రాక



● జలకళ

పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద కృష్ణమ్మ జలకళను సంతరించుకుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువ ప్రాంతానికి వరద నీరు విడుదల చేస్తుండటంతో బుధవారం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్దకు వరద నీరు చేరింది. ఇప్పటి వరకు వర్షాల జాడలేక ఆకాశంవైపు ఆశగా ఎదురుచూస్తున్న రైతులు కాల్వల ద్వారా వస్తున్న నీటిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - అవనిగడ్డ రూరల్



పవిత్ర సంగమం వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పూజలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కృష్ణమ్మ దరికి గోదావరి పరవళ్లు తొక్కింది. పట్టిసీమ పంపుల నుంచి పరుగులు తీసిన గోదారమ్మ బుధవారం కృష్ణమ్మ చెంతకు చేరింది. ఈ కలయికను స్వాగతిస్తూ ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జలహారతి ఇచ్చారు. ఎంపీ కేశినేని చిన్ని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పాల్గొన్నారు. గోదావరి జలాల రాకతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం మిగతా 6లో..

బదిలీల రచ్చ

జిల్లాలో కొలిక్కిరాని సచివాలయ ఉద్యోగుల బదిలీలు

6

రచ్చకెక్కుతున్న వివాదాస్పద జాబితాలు

- తప్పులతడకగా మహిళా పోలీసుల లిస్టు
- పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శుల బదిలీల్లో మతలబు
- సంక్షేమ శాఖల్లో ఇష్టానుసారంగా మార్పులు
- కోర్టును ఆశ్రయించిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు

జిల్లాలోని సచివాలయాల్లో బదిలీల అంశం ప్రహసనంగా మారింది. సచివాలయ కార్యదర్శుల బదిలీలు ఇంకా కొలిక్కి రాలేదు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులు తమ చిత్తానుసారంగా జాబితాలు రూపొందించారని, 100 కిలోమీటర్ల దూరంలోని సచివాలయాలకు తమను బదిలీ చేశారని రోడ్డెక్కి ఆందోళనలు చేసే వరకు పరిస్థితి వెళ్లింది. సమస్య పరిష్కరించాలని ఆయా శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించినా స్పందన లేకపోవడంతో వారంతా నిరసన బాట పట్టారు. వ్యవసాయ శాఖలోని బదిలీలపై అసిస్టెంట్లు కోర్టును ఆశ్రయించారు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

వ్యవసాయ శాఖలో కొలిక్కిరాని బదిలీలు

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను ఇటీవల బదిలీ చేస్తూ జాబితా విడుదల చేశారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధనతో ఈ బదిలీలు జరిగాయి. అయితే, శాసనసభ్యుల సిఫార్సు లేఖలను ఆధారంగా చేసుకుని అసిస్టెంట్లను కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సీనియారిటీ ఉన్నవారు కోరుకున్న ప్రాంతాల్లో కాకుండా 100 కిలో మీటర్ల దూరంలోని సచివాలయాలకు బదిలీ అయ్యారు. తమ కంటే జూనియర్లను వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారని, తమను మాత్రం దూరప్రాంతాలకు పంపారని సీనియర్లంతా కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టర్‌కు తమ గోడు తెలుపుకొన్నారు. మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. వీరి సమస్యను అధికారులు పరిష్కరించకపోగా, బదిలీల జాబితాలను విడుదల చేశామని, అందుకు అనుగుణంగా వెళ్లాలని హుకుం జారీచేశారు. దీంతో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అయినా అధికారులు స్పందించలేదు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు.



సోమవారం రాత్రి వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆ శాఖ అసిస్టెంట్లు

పంచాయతీరాజ్‌లో రెండో జాబితా

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ విభాగం అధికారులు బదిలీల జాబితాలను ఇష్టానుసారంగా తయారుచేసి విడుదల చేశారు. గ్రేడ్-5 సెక్రటరీలను ఒక్కో సచివాలయానికి ఒక్కరినే కేటాయించాలి. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు, ఇతరత్రా సిఫార్సులు వచ్చాయనే కారణాలు చూపి అధికశాతం సచివాలయాల్లో ఇద్దరేసి చొప్పున బదిలీ చేశారు. ఈ విషయాన్ని డీపీవో కార్యాలయ అధికారులకు తెలియజేయడంతో ఆ తప్పులను సరిదిద్ది, రెండో జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితాపై కలెక్టర్‌తో సంతకం చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ జాబితాలను డీపీవో కార్యాలయంలో కాకుండా పెనమలూరు, గంగూరులో తయారు చేశారని, ఇందులో ఏదో మతలబు మిగతా 6లో..

వివాదాస్పదంగా మహిళా పోలీసుల బదిలీలు

సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసుల బదిలీల్లోనూ తప్పులు దొర్లాయి. సమస్యను పరిష్కరించాలని వారు పలుమార్లు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. రెండోసారి మహిళా పోలీసులకు కౌన్సెలింగ్ నిర్వహించినా, సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఈ ప్రక్రియ కూడా కొలిక్కి రాకపోవడంతో వారంతా ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



రూ. కోటి కొట్టేశారు!

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మరో మోసం

తాడిగడప వాసికి రూ.1.42 కోట్లకు కుచ్చుటోపీ

పెనమలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో ఓ వ్యక్తి 1.42 కోట్ల దోపిడీకి గురయ్యాడు. ఈ ఘటనపై బుధవారం పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తాడిగడపలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉండే తారకటూరి అనురాగ్.. తెలియని ఓ ఫేస్‌బుక్ పేజీలో ప్రకటన చూసి దానిపై క్లిక్ చేశాడు. అవతలి వ్యక్తులు వాట్సాప్ అటెల్ నెంబరు ద్వారా స్పందించి ఆన్‌లైన్ పెట్టుబడి, ట్రేడింగ్ గురించి అతనికి వివరించారు. వారి మాటలను నమ్మిన అనురాగ్ హార్స్‌వీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. వారు ట్రేడింగ్‌లో కొన్ని షేర్లను అనురాగ్‌కు ఇవ్వగా, అతను రూ.1.80 కోట్లు చెల్లించాడు. వారు తొలుత రూ.38 లక్షలు అనురాగ్ ఖాతాకు మళ్లించారు. మిగిలిన 1.42 కోట్లను విత్‌డ్రా చేసుకోవడానికి అనురాగ్ ప్రయత్నించగా, సాధ్యపడలేదు. మోసపోయానని గ్రహించిన అనురాగ్ పోలీసులను ఆశ్రయించాడు.

నిధి.. హతవిధీ..!

నీరుగారుతున్న మైనింగ్ మినరల్ ఫండ్ లక్ష్యం

- ఉమ్మడి కృష్ణాజిల్లాకు రూ.180.17 కోట్ల ఆదాయం
- సింహభాగం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనిదే..
- వైసీపీ హయాంలో అనధికారిక మైనింగ్ కార్యకలాపాలు
- భారీగా అక్రమార్జన.. ప్రభుత్వానికి పైసా చెల్లించలేదు
- ఉన్న నిధులను ఉపయోగించడంలో జిల్లా యంత్రాంగం విఫలం
- మైనింగ్ ప్రాంతాలను మరిచి.. ఇతర కార్యక్రమాలకు వినియోగం

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అక్రమ మైనింగ్ కార్యకలాపాల వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాకు మూడేళ్లుగా ఎలాంటి ఆదాయం రాలేదు. లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్, ఇతర నిక్షేపాలను తవ్వుకుపోయిన అక్రమార్కులు రూ.కోట్లు గడించినా ప్రభుత్వానికి మాత్రం పైసా చెల్లించింది లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా మినరల్ ఫౌండేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. అధికారిక మైనింగ్ కార్యకలాపాల ద్వారా 2016 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఆదాయాన్ని జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్)గా పేర్కొంటారు. కాగా, 2016 నుంచి 2022 వరకు మాత్రమే అధికారికంగా మైనింగ్ కార్యకలాపాలు మిగతా 6లో..

వైసీపీ హయాంలో మట్టి అక్రమ తవ్వకాలు



కేటాయింపులు ఘనం.. ఖర్చు శూన్యం

రెండు జిల్లాల పరిధిలో మినరల్ ఫండ్ నిధులతో మొత్తం 996 పనులు చేపట్టారు. తాగునీటి సరఫరా, కాలుష్య నియంత్రణ చర్యలు, స్త్రీ శిశు సంక్షేమం, దివ్యాంగ పిల్లల సంక్షేమం, నైపుణ్య శిక్షణ, శానిటేషన్, ఇతర ప్రాధాన్యతా పనుల కోసం జిల్లా మినరల్ ఫండ్ నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.179.82 కోట్ల నిధులను పైన చెప్పుకొన్నట్టుగా కేటాయింపులు చేయగా, ఇప్పటివరకు కేవలం రూ.71.87 కోట్లే ఖర్చు చేశారు. దీనిని బట్టి చూస్తే మినరల్ ఫండ్స్ వినియోగం సక్రమంగా లేదని అర్థమవుతోంది.



● కదిలింది ఎర్రదండు

బీజేపీ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, వామపక్షాలు బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జిల్లాలో పాక్షికంగా జరిగింది. మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి కోనేరు సెంటరు వరకు సీఐటీయూ, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో

ఆరోగ్య లాభాలు

● అరుగొలనులో కలెక్టర్ బాలాజీ

8



మట్టిలో కూరుకున్న ఎక్స్‌కవేటర్ (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన టిప్పర్

మైనింగ్ మాఫియా ధనదాహం

నిండుప్రాణం బలి

అర్ధరాత్రి రాఘవాపురం కొండలో అక్రమ తవ్వకాలు

- ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు
- లారీపై మట్టిపడి డ్రైవర్ దుర్మరణం
- ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు సైతం గాయాలు
- అధికార పార్టీ వారు కావడంతో పట్టని అధికారులు

నందిగామ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్ మాఫియా ధనదాహానికి నిండుప్రాణం బలైంది. అధికార పార్టీ ముఖ్యనాయకుల కనుసన్నల్లో మండలంలోని రాఘవాపురం కొండను రాత్రివేళల్లో పెకిలిస్తూ నిత్యం మిగతా 6లో..



స్వామివారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుని హుండీ ఆదాయం రూ.1.11 కోట్లు

మోపిదేవి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి గ్రామంలోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయ, ధర్మదాయ శాఖ కృష్ణాజిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎన్.వి.సాంబశివరావు, దేవదాయశాఖ మచిలీపట్నం తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. రూ.1,11,75,901 నగదు, 2.550 కేజీల వెండి, 41.020 గ్రాముల బంగారు, 159 అమెరికన్ డాలర్లు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా రత్నాకర్ బాధ్యతల స్వీకరణ

కృష్ణలంక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయం మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పి.రత్నాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ) డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సీనియర్ అధికారి అయిన రత్నాకర్ ఐబీలో బాధ్యతలు స్వీకరించడానికి ముందు విజయవాడలోని సీబీసీ ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ క్షేత్ర ప్రచార విభాగాలు, వార్తా విభాగాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. తన సర్వీసులో విజయవాడలోని దూరదర్శన్ న్యూస్ ప్రాంతీయ వార్తల విభాగం, హైదరాబాద్ పీబీఐ, కడపలో ఫీల్డ్ పబ్లిసిటీ డైరెక్టరేట్ అధిపతిగా కూడా ఆయన పనిచేశారు. రాష్ట్రంలోని పీఆర్‌జీఐకి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రచార కార్యకలాపాలు, క్షేత్ర ప్రచార కార్యకలాపాలు, ప్రింట్ మీడియా సంస్థలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని ఈ సందర్భంగా రత్నాకర్ వివరించారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఘర్షణ

- వృద్ధురాలి మృతి, మరో ముగ్గురికి గాయాలు
- ఎ.కొండూరు శివారు పాత కొండూరులో ఘటన



కనకదుర్గ మృతదేహం

ఎ.కొండూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు శివారు పాత కొండూరులో 80 సెంట్ల స్థలం వివాదంలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకొన్న ఘటనలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన బుధవారం జరిగింది. ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... యలమంచిలి పాండురంగారావుకు, కుదరవల్లి అమరనాథ్ మధ్య గత కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలో బుధవారం పాత కొండూరు చెరువు కట్ట వద్ద యలమంచిలి పాండు రంగారావు, దమయంతి, మరో వర్గానికి చెందిన కుదరవల్లి అమర్‌నాథ్, అతని తల్లి కనకదుర్గ భూమి కోసం ఘర్షణ పడి, ఒకరిపై మరొకరు దాడులు చేసుకొన్నారు. ఈ దాడుల్లో అమర్‌నాథ్ తల్లి కనకదుర్గ (70) షాక్ గురై, బీపీ డౌన్ అయి కింద పడిపోయింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను 108 వాహనంలో ఎ.కొండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. పాండు రంగారావు, దమయంతి, అమర్‌నాథ్‌కు రక్త గాయాలైయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టార్ హోటళ్లలో బార్ పాలసీ బలోపేతానికి సహకరించండి

విజయవాడ సిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టూరిజం, ఎంఐసీఈ(మీటింగ్స్ ఇన్‌సెంటీవ్స్, కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్) అభివృద్ధి కోసం స్టార్ హోటల్‌లలో బార్ పాలసీని మరింత బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్(ఏఎస్‌హెచ్‌ఏ) కోరింది. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్‌కు ఏఎస్‌హెచ్‌ఏ ప్రతినిధులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రీమియం బ్రాండ్‌లకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశ్రమలు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేందుకు రూపొందించిన ప్రగతి శీల బార్ పాలసీని కమిషనర్‌కు వివరించారు.కమిషనర్‌ను కలిసిన వారిలో ఏఎస్‌హెచ్‌ఏ అధ్యక్షులు ఆర్.వి.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

బదిలీల రచ్చ

(5వ పేజీ తరువాయి)

ఉందని సచివాలయ కార్యదర్శులు చెప్పుకొంటున్నారు. దివ్యాంగురాలైన ఓ మహిళా సచివాలయ కార్యదర్శి. తన ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు దగ్గరలోని సచివాలయానికి బదిలీ చేయాలని కోరింది. ఆమె అభ్యర్థనను పట్టించుకోని డీపీవో కార్యాలయ అధికారులు 60 కిలోమీటర్ల దూరంలోని సచివాలయానికి బదిలీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎటూ తేలని సాంఘిక సంక్షేమ శాఖ బదిలీలు

సాంఘిక సంక్షేమ శాఖలో బదిలీల జాబితాలను తయారుచేసి ఇంతవరకు విడుదల చేయలేదు. ఈ కార్యాలయంలో పనిచేసే కొందరు సిబ్బంది ఈ జాబితాలను శాసనసభ్యుల కార్యాలయాలకు పంపారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యేలు తాము పంపిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకోకుండా, ఇష్టారాజ్యంగా బదిలీలు ఎలా చేస్తారని మండిపడ్డారు. దీంతో ఈ శాఖకు చెందిన సచివాలయ ఉద్యోగుల బదిలీల జాబితాలు సిద్ధం కావడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

నకిలీ మకిలీ

(5వ పేజీ తరువాయి)

కూడా బయటపడినట్టు సమాచారం. ఇలా దాదాపు 30 మంది ఏఎన్ఎంలు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ముడుపులిచ్చైనా ఉద్యోగాలు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్ల బండారం బయటపడటంతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బంది, అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తా : డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట

జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేసే ఏఎన్ఎంల వివరాలు సేకరిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వివరాలను ముందుగా కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. పారా మెడికల్ బోర్డుకు నివేదిక కాపీని పంపుతామని, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నిర్ణయం ఏదైనా కమిషనరే తీసుకోవాలని, తన చేతిలో ఏమీ లేదన్నారు. నకిలీ సర్టిఫికెట్‌దారులు కొందరు తనపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని, లొంగేది లేదని, వాస్తవాలను ఉన్నతాధికారుల ముందు ఉంచుతానన్నారు.

ప్రకృతి స్వరూపిణి

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు
- ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు కూరగాయలు, ఆకుకూరలతో ముస్తాబు
- పచ్చని పందిళ్లతో శోభాయమానంగా ప్రాంగణం.. దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఇంద్రకీలాద్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం మూలవిరాట్ దుర్గమ్మను వివిధ రకాల పండ్లు, ఆకు కూరలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలను, దేవతామూర్తులను కూరగాయల దండలతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయ అలంకరణ, కదంబం ప్రసాదం తయారీకి భారీగా ఆకు కూరలు, కూరగాయలను వినియోగించారు. కరివేపాకుతో ఆలయ ప్రాంగణంలో పందిరిగా వేశారు. ఆలయ ప్రాంగణం అంతా పచ్చని పందిళ్లతో శోభాయమానంగా దర్శనమిచ్చింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆఖరి రోజు గురువారం కూడా ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉదయం మహాపూర్ణాహుతి కార్యక్రమంతో తొలిరోజు ప్రతిష్ఠించిన కళశాలకు ఉద్వాసన పలకనున్నారు. వేద పండితులు, అర్చకులు శాంతి మంత్రాలు పఠించనున్నారు. లోకశాంతి కోసం అమ్మవారికి నివేదన సమర్పించనున్నారు.

నేడు గిరి ప్రదక్షిణ

పౌర్ణమిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ గురువారం నిర్వహిస్తున్నట్టు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.



దుర్గమ్మను ఆరాధిస్తున్న భక్తులు

దుర్గమ్మ సేవలో ఎంఎస్‌కే ప్రసాద్

కనకదుర్గమ్మను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనున్న ఆలయ ఈవో శీనా నాయక్ ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, అలాగే రాజధాని అమరావతిలో క్రికెట్ రంగ అభివృద్ధి గురించి చర్చించుకున్నారు.



ఎంఎస్‌కే ప్రసాద్‌తో ఈవో శీనా నాయక్



అమ్మవారి నామాన్ని పారాయణ చేస్తున్న మహిళలు



దుర్గమ్మ అంతరాలయంలో భక్తుల రద్దీ



కదంబ ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నిధి.. హతవిధీ..!

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. అయినప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగానికి భారీగానే మినరల్ ఫండ్స్ వచ్చాయి. 2022 నుంచి వైసీపీ ప్రభుత్వం ముగిసే వరకు ఎలాంటి ఆదాయం రాలేదు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జోరుగా సాగటమే ఇందుకు కారణం. గ్రావెల్ నిక్షేపాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ.. అనధికారికంగా లక్షలాది క్యూబిక్ మీటర్లు తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. ఎన్నికలకు ముందు రెండేళ్ల జరిగిన ఈ అనధికార మైనింగ్ వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాకు పైసా ఆదాయం రాలేదు.

మొత్తం మినరల్ ఫండ్ రూ.180.17 కోట్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అధికారిక మైనింగ్ కార్యకలాపాల ద్వారా 2016 నుంచి ఇప్పటివరకు (వైసీపీ హయాంలోని రెండేళ్ల మినహా) రూ.180.17 కోట్ల ఆదాయం సమకూరింది. వైసీపీ హయాంలోని ఆ రెండేళ్ల కూడా మినరల్ ఫండ్ వచ్చి ఉంటే ఆదాయం రూ.250 కోట్ల వరకూ వెళ్లేది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సింహభాగం మినరల్ ఫండ్స్ వచ్చాయి. అప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉండటంతో అప్పటి కలెక్టర్లు ఈ నిధుల్లోని రూ.47.62 కోట్లను వివిధ కార్యక్రమాలకు ఖర్చు పెట్టారు. 2022, జూన్ 10 నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లా ఖాతాలో రూ.132.55 కోట్ల మినరల్ ఫండ్ మిగిలి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజన కారణంగా రూ.75.66 కోట్ల మినరల్ ఫండ్‌లో రూ.17.78 కోట్లు కృష్ణాజిల్లాకు, రూ.55.60 కోట్లు ఎన్టీఆర్ జిల్లాకు, రూ.2.28 కోట్లు ఏలూరు జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు కేటాయించారు. ఇంకా రూ.56.89 కోట్ల మినరల్ ఫండ్స్ మిగిలి ఉన్నాయి. వీటిని దామాషా ప్రకారం కృష్ణాజిల్లాకు రూ.13.37 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాకు రూ.41.80 కోట్లు, ఏలూరు జిల్లాకు రూ.1.72 కోట్లు బదలాయించారు.

మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకే ఖర్చు చేయాలి

అధికారిక మైనింగ్ కార్యకలాపాల ద్వారా రాయల్టీగా వచ్చే జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్)ను వాస్తవంగా ఎక్కడైతే మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయో ఆ ప్రాంతాల్లోని 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలి. కానీ, జిల్లాస్థాయిలో ప్రాధాన్యతా కార్యక్రమాల కోసం ఖర్చు చేశారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేసింది స్వల్పం. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు పెద్దసంఖ్యలో జరిగాయి. ఈ ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం ఖర్చు పెట్టింది శూన్యమనే చెప్పాలి. కృష్ణాజిల్లాలో గన్నవరం, మల్లవల్లి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులిచ్చారు. కానీ, ఈ ప్రాంతాల పరిధిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అధికారిక ఇసుక రీచ్‌ల ద్వారా వచ్చే మినరల్ ఫండ్‌ను కూడా ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ఖర్చు చేయలేదు.

లక్ష్యాన్ని నీరుగార్చారు

జిల్లా మినరల్ ఫండ్ నిధుల ఉద్దేశాన్ని నాటి ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగం కానీ, పునర్విభజన తర్వాత ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగాలు కానీ నెరవేర్చలేదు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా, జిల్లా యంత్రాంగాలు తమ ప్రాధాన్యత కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నారు. మైనింగ్ ప్రభావిత గ్రామాల్లో దుమ్మూధూళి, కాలుష్యం వంటివి పెచ్చుమీరుతున్నాయి. రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగాలు మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కృష్ణమ్మ దరికి గోదారి

(5వ పేజీ తరువాయి)

క్రమంగా పెరుగుతోంది. ఉదయం పవిత్ర సంగమాన్ని తాకిన గోదావరి జలాలు సాయంత్రానికి బ్యారేజీ వద్దకు చేరాయి. దీంతో డెల్టా ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పట్టిసీమ నుంచి 16 పంపుల ద్వారా గోదావరి జలాలను కృష్ణానదిలోకి వదిలారు. మొత్తం 5,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో పంపు నుంచి రోజుకు 350 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.

బ్యారేజీ వద్ద పెరుగుదల

బ్యారేజీకి దిగువన తూర్పు డెల్టాలో మొత్తం 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ డెల్టాలో ఖరీఫ్ సాగుకు 155.40 టీఎంసీల నీరు అవసరం. బ్యారేజీ పూర్తిస్థాయి నీటి పరిమాణం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం ఇక్కడ 2.83 టీఎంసీల నీరు ఉంది. బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల కావడానికి సమయం పట్టే అవకాశం ఉంది. శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీరు నాగార్జున సాగర్‌కు చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండాక దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఈ నీరు వస్తే గానీ పులిచింతల గేట్లు ఎత్తే పరిస్థితి ఉండదు. ఈలోగా గోదావరి జలాలతో బ్యారేజీ వద్ద ఉన్న నీటిమట్టాన్ని పెంచాలన్న ఆలోచనలో జలవనరుల శాఖ అధికారులు ఉన్నారు. పట్టిసీమ నుంచి 2015-16 సంవత్సరంలో 8.50 టీఎంసీలు, 2016-17 సంవత్సరంలో 55.60 టీఎంసీలు, 2017-18 సంవత్సరంలో 105.00 టీఎంసీలు, 2018-19 సంవత్సరంలో 26.88 టీఎంసీల నీటిని కృష్ణాకు తరలించారు. వైసీపీ ప్రభుత్వం రెండేళ్లు మాత్రమే పట్టిసీమ నుంచి నీటిని తీసుకుంది. పట్టిసీమ నీటి సామర్థ్యం 8,500 టీఎంసీలు. ఇక్కడ 24 పంపులు ఉన్నాయి. ఒక్కో పంపు ద్వారా 350 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయవచ్చు. ప్రస్తుతం పట్టిసీమ నుంచి 5,600 క్యూసెక్కుల నీరు కృష్ణానదిలోకి వచ్చి చేరుతోంది. గడిచిన వ్యవసాయ సంవత్సరంలో మొత్తం 20.06 టీఎంసీల నీరు పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీకి చేరింది.

వంతెనపై ప్రయాణం.. ప్రమాదం



కృష్ణాజిల్లా మొవ్వ మండలంలో కూచిపూడి నుంచి చిన్న ముత్తేవి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన రేకుల వంతెన ప్రమాదకరంగా మారింది. మధ్యలోని రేకులు ఊడిపోయి కిందకు కుంగిపోయాయి. ఆదమరచి అటువైపు వాహనంపై వెళ్తే వంతెనపై నుంచి కిందపడి గాయాలపాలు కావాల్సిందే. -ఆంధ్రజ్యోతి-విజయవాడ

మైనింగ్ మాఫియా ధనదాహం

(5వ పేజీ తరువాయి)

200 లారీల మట్టిని కొల్లగొడుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతుండగా, కొండచరియలు విరిగిపడి టిప్పర్‌పై పడ్డాయి. భారీగా కొండచరియలు పడటంతో టిప్పర్‌తో పాటు ఎక్స్‌కవేటర్ మట్టిలో కూరుకుపోయింది. ఒక్కసారిగా అంత మట్టిపడటంతో టిప్పర్ పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ దాసరి చిన వెంకటేశ్వర్లు (42) గాయాలు కాగా, విజయవాడలోని ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయని తెలుస్తోంది. అతని వివరాలు బయటపడకుండా మాఫియా జాగ్రత్త పడింది. ఘటనాస్థలంలో మట్టిలో కూరుకుపోయిన టిప్పర్‌ను క్రేన్ సాయంతో గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద పెట్టారు. కాగా, తెరవెనుక ఆ ఘటనను కప్పిపుచ్చే కుట్రలు చేస్తున్నట్టు తెలిసింది.

స్పందించని అధికార యత్రాంగం

రాఘవాపురం గట్టు వద్ద మట్టి అక్రమ రవాణా జరుగుతున్న సంగతి తెలిసినా స్పందించని అధికారులు.. ఓ వ్యక్తి నిండిప్రాణం బలైనా కూడా కనీసం పట్టించుకోలేదు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది ఇటువైపు తిరిగి చూడలేదు. మట్టి అక్రమ తవ్వకాలు జరిపేది అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు కావడం వల్లే ఇలా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఘటన తెల్లవారుజామున జరిగితే మధ్యాహ్నం వరకు పోలీసులెవరూ ఆ ప్రాంతాన్ని సందర్శించలేదు. ఇదేమిటని ప్రశ్నించగా, పోలీసుల నుంచి విచిత్రమైన సమాధానం వచ్చింది. ఫిర్యాదు అందాకే ఘటనాస్థలిని పరిశీలిస్తామని, మట్టి అక్రమ తవ్వకాలపై తమకు ఎటువంటి సంబంధం లేదని వింతగా సమాధానం చెప్పారు. కాగా, పోలీసుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలూ వస్తున్నాయి. కనీసం రెవెన్యూ యంత్రాంగం కూడా ఇటువైపు చూడకపోవడం గమనార్హం.

అర్ధరాత్రి ఆత్రుతలో..

చేసేది అక్రమ వ్యాపారం కావడం వల్లే అర్ధరాత్రి ఆత్రుతగా ఇలా లోడింగ్ చేస్తున్నట్లు తెలిసింది. టిప్పర్‌ను కొండకు ఆనించి పెట్టి, ఎక్స్‌కవేటర్‌తో నేరుగా లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం. మట్టిని కిందకు లాగి, లోడింగ్ చేస్తే ఆలస్యమవుతుందనే ఇలా చేశారని తెలిసింది.

డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం నేడు

- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఉంగుటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజా మందిరంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ (వెంకట రామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా) ఆరవ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి కార్యక్రమంలోని వివిధ అంశాలపై ట్రయల్ రన్ నిర్వహించారు. కాగా, ఉదయం 10.10 గంటలకు రాజ్‌భవన్ నుంచి రోడ్డుమార్గం ద్వారా బయలు దేరి 10.50 గంటలకు ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుంటారు. 11 గంటల నుంచి 12.15 గంటల వరకు ట్రస్ట్‌లోని ప్రజామందిరంలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం 12.25 గంటలకు స్వర్ణభారత్‌ట్రస్ట్ నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి 13.05 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు వెళ్తారు.

అమరావతిలో జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్ట్‌ను తిరిగి అమలు చేయండి

- మంత్రి నారాయణకు జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల వినతి



మంత్రి నారాయణకు వినతి పత్రం ఇస్తున్న నేతలు

విజయవాడ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కోసం 2014-19 మధ్య కాలంలో అమరావతిలో 30 ఎకరాల్లో ప్రతిపాదించిన జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్‌ను తిరిగి అమలు చేయాలని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సచివాలయంలోని మంత్రి నారాయణను సొసైటీ ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేసి బహుళ అంతస్థుల భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దేశంలోనే మోడల్ జర్నలిస్ట్ కాలనీ నిర్మిస్తామని గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఉత్తర్వులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబుతో చర్చలు జరిపి దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటామని జర్నలిస్టులకు మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్ట్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల శ్రీనివాసరావు, ఫౌండర్ సెక్రటరీ చావా రవి, డైరెక్టర్లు ఈశ్వర్, శ్రీనివాస్, నరసింహారావు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణమోహన్, మల్లికార్జున్, పవన్, ముక్కంటి ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కానూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ కానూరులోని నాగార్జున హాస్పిటల్‌రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఆయన అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల కష్టాలు తీర్చేందుకు టీడీపీ ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పంచాయతీల సమగ్ర అభివృద్ధిపై శిక్షణ

ఉంగుటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల పురోగతిలో భాగంగా పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై(పీఏఐ 2.0) స్థానిక స్త్రీశక్తి భవనం మీటింగ్ హాలులో బుధవారం మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై రిసోర్స్ పర్సన్లు ఐజాక్, ఫణి అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం

కేసరపల్లి సర్పంచ్ లక్ష్మీమౌనిక

గన్నవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి లక్ష్మీ మౌనిక మాట్లాడుతూ, గ్రామపంచాయితీ నిధులు రూ. 1.20 కోట్లుతో కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వార్డు సభ్యులు మేకల రత్నమాల, యర్రగాని రత్తయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి 1గంట వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన అవుటపల్లి, మర్లపాలెం, వేపగుంట, మేఘన రోడ్డు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యాభివృద్ధికి లయన్స్ సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సహకారంతో పాటు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల చక్రవర్తి విద్యార్థులకు సూచించారు. ఓగిరాలలోని ఎంపీపీ స్కూల్, ఎంపీయూపీ స్కూల్‌లో 83మంది విద్యార్థులకు సీనియర్ లయన్స్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య సహకారంతో నోటు పుస్తకాలు, పెన్సిళ్లు తదితర విద్యా సామాగ్రిని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు రాఘవయ్య, కగ్గా డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ లేఅవుట్లలో స్థలాలు కొంటే అనుమతులు లభించవు

ఉయ్యూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేని లేఅవుట్లలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసి అవస్థలు పడవద్దని మండల తహసీల్దార్ ఎం. సురేశ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, సొంతి ఇంటి కల నెరవేర్చుకునేందుకు అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేస్తున్నారన్నారు. అనుమతి లేకుండా వేసిన లే అవుట్లలో ఇంటి స్థలం కొంటే అందులో ఇల్లునిర్మించుకునేందుకు ఇంటిప్లాను మంజూరు కాదని, బ్యాంకుల నుంచి రుణం లభించదన్నారు. సీఆర్డీఏ అప్రూవల్ ప్లాన్ ఉందో లేదో తప్పనిసరిగా తెలుసుకుని ఆ లే అవుట్ నంబరు ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుని తరువాతే కొనుగోలు చేయాలని సూచించారు.



పోరంకిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. యనమలకుదురులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న యార్లగడ్డ సుచిత్ర.. ఉయ్యూరు 6వ వార్డులో వైవీబీ రాజేంద్రప్రసాద్

మహిళా సంక్షేమం, అభ్యున్నతికి ప్రాధాన్యం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ



బ్రదర్ జోసఫ్‌తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంక్షేమం, అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తూ మహిళా పక్షపాతిగా మహిళలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశంపార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని పెదఅవుటపల్లిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ బ్రదర్ జోసఫ్ తంబి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు మున్నా రామకృష్ణ, మరీదు ఉషా రాణి, కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, కొండేటి వెంకటేశ్వరరావు, గూడవల్లి నర్సయ్య, రెబ్బాతంబి, కొండేటి కొండలరావు, చిరుమామిళ్ల సూర్యం, గులిపల్లి సందీప్, పాలడుగు మల్లికార్జునరావు, పరుచూరి నరేష్, రవివర్మ పాల్గొన్నారు.

పెనమలూరు : సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం పోరంకి కార్మికనగర్ కట్ట, పెనమలూరు గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రాంకుమార్, సంగెపు రంగారావు, లింగాల భాస్కరరావు, తోటకూర ఉదయ భాస్కర్, ముని సిపల్ కమిషనర్ షేక్ నజీర్, ఎంపీడీవో ప్రణవి పాల్గొన్నారు.

● ఎన్డీయే కూటమి సంక్షేమ పథకాలు జెట్ స్పీడులో అమలవుతున్నాయని టీడీపీ నేతల శొంఠి శివరాంప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం యనమలకుదురులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తాడిశెట్టి వీరాస్వామి, సంగీతరావు, విజయ్‌కుమార్, రాజా, సింగం సుబ్రహ్మణ్యం, బలగం నాగరాజు, జన్ను నాగరాజు, వీరంకి నంది తదితరులు పాల్గొన్నారు.

● బరితెగించిన వైసీపీ నాయకులు రాష్ట్ర మహిళలపై చేస్తున్న వ్యాఖ్యలు జుగుప్సాకరగా ఉంటున్నాయని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర వ్యాఖ్యానించారు. బుధవారం యనమలకుదురులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న సుచిత్ర వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

ఉయ్యూరు : అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వెనుకడుగు వేసేది లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు 6వ వార్డులో పర్యటించి ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. నగర పంచాయతీ చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు ఖుద్దూస్, పార్టీ నాయకులు గుర్నాధరావు, కూనప రెడ్డి వాసు, నాగరాజు, అజ్మతుల్లా, వంగవీటి శ్రీనివాస ప్రసాద్, రత్నం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్, ఉంగుటూరులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మె



ఉయ్యూరులో ఉద్యోగుల నిరసన

ఉయ్యూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించి, డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ ఏపీపీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం కేడీసీసీ బ్యాంకు ఎదుట కొద్దిసేపు ధర్నా చేసి నిరసన తెలిపారు. బ్యాంకు పరిధిలో సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొని డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** సార్వత్రిక సమ్మెలో పీఏసీఎస్ ఉద్యోగులు పా ల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో పీఏసీఎస్ సీఈవో లతో కలిసి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు ప్లకార్డులు ప్రద ర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అవినాష్, సూపర్‌వైజర్ నజీర్, సిబ్బంది, పీఏసీఎస్ సీఈఓలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం ఉంగుటూరు కేడీసీసీబీ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుడు సీహెచ్ వెంకటశివపూర్ణప్రసాద్, యూనియన్ ఉంగుటూరు బ్రాంచ్ ఆర్గనైజర్ ఈవీ రవీంద్రబాబు, ఎలుకపాడు, వెల్దిపాడు, ఉంగుటూరు పీఏసీఎస్‌ల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



కంకిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు 2025- 2026 సంవత్సరానికి నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా మద్దుల యుగంధర్, సెక్రటరీగా నల్లజర్ల నీహార్, ట్రెజరర్‌గా గౌతమి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంతెన అంగన్వాడీ కేంద్రానికి రూ. 5వేలు, మరొకరికి రూ. 4వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. మద్దుల గోవింద్, కోమటి భారతి, బండి నాంచారయ్య, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, శివశంకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

● 11పీఏసీఎస్‌ల్లో 4జనసేన, 7టీడీపీకి కేటాయింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలంలోని 11 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. బాపులపాడు మండలంలో 4జనసేనకు, 7టీడీపీకి కేటాయించినట్లు నాయకులు తెలిపారు. వడ్డి శివనాగేశ్వరరావు (బాపులపాడు), వడ్డి అశోక్ కుమార్ (కొత్తపల్లి), బెజవాడ వాసు (బిళ్లనపల్లి), యజ్జవరపు శ్రీనివాస రావు(కాకులపాడు), కలపాల నాగవెంకటశివప్రసాద్ (వీరవల్లి), బేతా సుజాత (ఆరుగొలను), దన్నే దుర్గారావు (కానుమోలు), కొల్లి వెంకట లక్ష్మీనారాయణ (కొయ్యూరు), షేక్ జాన్‌బాషా (మల్లవల్లి), కనకవల్లి శేషగిరిరావు (రంగన్నగూడెం), అవిర్నేని భవానీశంకర్ (వేలేరు)లను చైర్‌పర్సన్‌లుగా నియమించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఆభరణాలు తనిఖీ



హనుమాన్‌జంక్షన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డు శ్రీలక్ష్మీవేంటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి వెండి, బంగారం ఆభరణాలను బుధవారం ఎండోమెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి వి.పళ్లంరాజు దేవ స్థానంలో ఉన్న ఆభరణాలను విచారించి పరిశీలించారు. బంగారం 233.410 గ్రాములు, వెండి 34.446కేజీలు ఉన్నట్లు ధ్రువీకరించారు. భక్తులు ఎటువంటి విరాళాలు ఇచ్చిన రశీదు ఇవ్వాలని తెలిపారు. ఆలయంలో ఉన్న అన్ని ఆభరణాలకు ఇన్సూరెన్సు చేయాలని ఈవో వై.శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆలయ ట్రస్టీలు కాకాని అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనమలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వివిధ అనారోగ్యంతో బాధపడుతున్న 27మంది నియోజకవర్గ పౌరులకు 15.87లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో తాను నియోజకవర్గం మొత్తం మీద ఇరవై కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, లింగాల భాస్కరరావు, మంచినేని పరమేష్, సంగెపు రంగారావు, మొక్కపాటి శ్రీనివాస్, ముసునూరు శ్రీనివాసరావు, తాతపూడి గణేష్, యెలుకల విజయేంద్ర, పీతా గోపీచంద్, నర్రాచంటి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా భారీ ప్రదర్శన, నిరసనలు



తాడిగడప సెంటరులో సీఐటీయూ నిరసన.. ఉయ్యూరు సెంటర్‌లో..

పెనమలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరంకి సెంటరు నుంచి తాడిగడప సెంటరు వరకు వందలాది మంది సాధారణ కార్మికులు, మునిసిపల్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తాడిగడప సెంటర్లో నిరసన సభ నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ వై లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు క్రాంతి మాట్లాడుతూ కార్మికులందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన సభలో ఆశావర్కర్సు యూనియన్ నాయకులు రాణి, సరస్వతి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రేవతి, విజయలక్ష్మి, కాలేశ్వరి, మునిసిపల్ యూనియన్ నాయకులు సరళ, వెంకటరెడ్డి, రత్నకరుణ, సత్యనారాయణ, భిక్షాలు, మరియమ్మ, షేక్ ఖాసిం, ఎస్కే బాబు ప్రసంగించారు.

కానూరు : రద్దుచేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు కోరుతూ బుధవారం సమ్మె కానూరులో పాక్షికంగా జరిగింది. కానూరులోని బందరు రోడ్డు, మెయిన్ రోడ్డు, పంటకాలువరోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం దుకాణాలు, బ్యాంక్‌లు, పలు ప్రభుత్వం, ప్రైవేట్ కార్యాలయాలు యధావిధిగాగా తెరిచినా ఆందోళనకారులు వచ్చి వాటికి కొద్దిసేపు మూయించివేశారు.

ఉయ్యూరు : నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ సీఐటీయూ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యూరులో కార్మికులు, ఉద్యోగులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ప్రధాన సెంటర్‌కు చేరుకుని డిమాండ్ల పరిష్కారం కోరుతూ నినాదాలతో హోరెత్తించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం. హరిబాబు, బి.రాజేశ్, అన్నేసుబ్బారావు, బి.కీర్తి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : కార్మికులకు మరణ శాసనంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గన్నవరంలో కార్మిక, కర్షక ప్రదర్శన బుధవారం జరిగింది. కళ్ళ వెంకటేశ్వరరావు, మల్లంపల్లి అంజనేయులు గండికోట సమ్మక్క, నూరగాని సాంబశివరావు, పాలడుగు శ్రీమన్నా రాయణ, బ్రహ్మాచారి, కనకదుర్గ, వీరమ్మ, గణేష్, మిరపా నాగేశ్వరరావు, మల్లంపల్లి లలితకుమారి, కొలుసు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడానికి కార్మిక ఉద్యోగ సంఘాలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు అన్నారు. బుధవారం బాపులపాడు మండల సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పాటించారు.ఈ సందర్భంగా అన్ని కార్మిక సంఘాలు జంక్షన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకు లు బేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, అబ్దుల్ బారి. తోట సాంబశివరావు, రాజనాల సురేష్, వడ్డి గిరిధర్,సుంకర రమాదేవి, పరంజ్యోతి,షేక్ ఖాదర్ తదితరులు నాయకత్వం వహించారు.

ఉంగుటూరు : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌ల చట్టాలను రద్దు చేసేవరకు సీఐటీయు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు టీవీ లక్ష్మణస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, పిల్లి రాజారావు, రామ్మోహనరావు, సలీం, సుబ్బారెడ్డి, బి.సాంబ, సీహెచ్ లక్ష్మి, పుణ్యవతి, కోటేశ్వరమ్మ, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజనపథకం, పారిశుధ్యకార్మికులతోపాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గన్నవరంలో జరిగిన ప్రదర్శన అనంతరం మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు.. హనుమాన్ జంక్షన్‌లో కార్మిక సంఘాల ర్యాలీ.. ఉంగుటూరులో ..

లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరాటం

● లెనిన్ సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో వక్తలు ● భారత్ బంద్ సందర్భంగా విజయవాడలో ర్యాలీ

గవర్నర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మికుల పక్షాన పోరాటం ఆపేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతుల కు వ్యతిరేకంగా అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ట్రేడ్ యూనియన్ సంస్థలు బుధవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నగర వ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు ఏఐటియూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీయూసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఐఎఫ్‌టీయూ, వాటి అనుబంధ సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. ట్రేడ్ యూనియన్ల సమ్మెకు రైతు సంఘాలు సైతం మద్దతుగా నిలిచాయి. ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ రథం సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు కార్మికులు జెండాలు, బ్యానర్లు, ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్ని బహిష్కరించారు. కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో ప్రజా రవాణా వ్యవస్థ పలుచోట్ల నిలిచిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, షాపులు మూతపడ్డాయి. ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కే దుర్గారావు అధ్యక్షతన లెనిన్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ లేబర్ కోడ్‌లు పరిశ్రమ యజమానులకు అనుకూలంగా రూపొందించారన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె కొసమెరుపు మాత్రమేనని, రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధం చేయాల్సి ఉందన్నారు. రైతు సంఘ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో బడా కంపెనీలకు పెద్దపీట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయన్నారు. రైతు సంఘం నేతలు వై కేశవరావు, ఎం వెంకటరెడ్డి, పీ హరిబాబు, ఇప్టూ రాష్ట్ర అధ్యక్షుడు పీ ప్రసాద్, ఏఐఎఫ్‌టీయూ నేత జాస్తి కిషోర్‌బాబు, బ్యాంకు అసోసియేషన్ నేతలు అజయ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నేతలు కే పోలారి, ఎం రామకృష్ణ, అనుబంధ సంఘాల నేతలు మరీదు ప్రసాద్, పీ గౌతంరెడ్డి, త్రినాథ్ ప్రసంగించారు. కార్మికులు తరలివచ్చారు.



విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు, శ్రేణులు

కృష్ణాలో సమ్మె పాక్షికం

మచిలీపట్నం: బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, వామపక్షాలు బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జిల్లాలో పాక్షికంగా జరిగింది. గుడివాడలో పాఠశాలలు తెరవలేదు. మచిలీపట్నంలో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. మచిలీపట్నంలో ఎల్‌ఐసీ, యూనియన్ బ్యాంకులు పనిచేయలేదు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను నేతలు మూసివేయించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు యథావిధిగా పనిచేశాయి. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలివ్వాలని, కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. మచిలీపట్నంలో బస్టాండ్ సెంటర్ నుంచి కోనేరు సెంటరు వరకు సీఐటీయూ, ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎంతోకొంత రక్షణ కవచంగా 29 కార్మికచట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ చట్టాలను రద్దు చేసే వరకు కార్మికులు పోరాటాలు చేయాల్సిందేనన్నారు. అవనిగడ్డ, చల్లపల్లి, హనుమాన్‌జంక్షన్, గుడివాడ, కూచిపూడి, ఉయ్యూరు, నందివాడ, కోడూరు, పామర్రు ప్రాంతాల్లో కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని నినాదాలు చేశారు.



తైక్వాండో చాంపియన్ షిప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్

తైక్వాండో పోస్టర్ ఎంపీ చిన్ని ఆవిష్కరణ

వన్‌టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 10వ నేషనల్ ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోస్టర్‌ను ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ది కృష్ణా డిస్ట్రిక్ తైక్వాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ చాంపియన్ షిప్ పోటీలు జూలై 25 నుంచి 27 వరకు పటమట హైస్కూల్ రోడ్డులోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఎంపీ శివనాథ్‌కు అసోసియేషన్ సెక్రటరీ ఎల్ శివ భాస్కర్ వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, సభ్యులు వీ రాము, పీ సంపత్, ఎస్ రంజిత్ పాల్గొన్నారు.



బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో

సత్యనారాయణపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్ సింగ్ రోడ్డులోని నాడార్స్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నుంచి 4 రోజుల పాటు బెజవాడ బిజినెస్ ఎక్స్‌పోను మహిళలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపార, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గంగరాజు సూర్యకుమారి, కొప్పరపు ఉమాబలరామ్ తెలిపారు. బుధవారం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల మహిళలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపారులు పారిశ్రామికవర్గాలకు చెందినవారు తమ ఉత్పత్తులు ప్రదర్శించి ఆ ధరకే విక్రయించడం జరుగుతుందన్నారు. మహిళల దుస్తులు, ఫుడ్ ప్రొడక్ట్స్, ఆయుర్వేద ఉత్పత్తులు, పచ్చళ్లు, పొడులతో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. నిర్వాహకులు శిష్టా కుసుమ లావణ్య, రాజంపూడి అమూల్య, రాచకొండ లక్ష్మి, కస్తూరి హనుమంతరావు, వాడ్రేవు సుబ్బారావు, కొప్పరపు బలరామ్ పాల్గొని ఎక్స్‌పో కరపత్రాలు ఆవిష్కరించారు.

కేటీఎం పండుపై పీటీ వారెంటు జారీ

● 14 రోజులు రిమాండ్

బెంజ్‌సర్కిల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 2023లోని ఓ కేసులో కొడూరు మణికంఠ అలియాస్ కేటీఎం పండును పటమట పోలీసులు పీటీ వారెంట్‌పై నెల్లూరు సబ్‌జైలు నుంచి మంగళవారం తీసుకొచ్చారు. బుధవారం న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో పండును తిరిగి నెల్లూరు సబ్‌జిల్లాకు తరలించారు. 2023లోని ఓ కేసులో అరెస్టు పెండింగ్ నిమిత్తం పటమట పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసినట్టు వెల్లడించారు.



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారం

● జిల్లా ప్రధానన్యాయమూర్తి గోపి

మచిలీపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారానే కేసులు త్వరగా పరిష్కారమవుతాయని జిల్లా ప్రధానన్యాయమూర్తి జీ గోపి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని 64మంది మీడియేటర్లకు ఒకరోజు శిక్షణ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలోచనా విధానాన్ని మార్చుకుని, జాతి పునర్నిర్మాణం కోసం దిద్దుబాటువైపు ప్రయాణం చేయాలన్నారు. కోర్టుల్లో 10 నుంచి 30 ఏళ్లకు పైబడిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ కేసులను మధ్యవర్తుల ద్వారా పరిష్కారం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి రామకృష్ణయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ వివిధ కేసులు పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో 11 బార్ అసోషియేషన్లలోని 64 మంది న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి, రానున్న 90 రోజుల్లో పలు కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. విజయవాడ 2వ, 3వ అదనపు జిల్లా జడ్జిలు, మచిలీపట్నం బార్ అసోషియేషన్ నుంచి లంకిశెట్టి బాలాజీ, అడపా మురళీ, గరిమెళ్ల ప్రభాకరరావు, గంజి నాగేంద్రం పాల్గొన్నారు.

ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్‌గా కొండా



ఉయ్యూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా, గండిగుంట ఆనందపురానికి చెందిన కొండా ప్రవీణ్ చైర్మన్‌గా, జరుగు ఆదినారాయణ వైస్ చైర్మన్‌గా నియమితులవగా సభ్యులుగా బాణావతు రామచంద్రరావు, భీమడోలు జయరాజు, దోనేపూడి శివాజీ, దూసర సముద్రవేణి, గిరిడి వెంకటేశ్వరరావు, గొరిపర్తి లక్ష్మీదేవి, గుత్తికంటి సౌజన్య, మర్రెడ్డి సుజాత, షేక్ జలీల్, తాడిపర్తి కుమారి, కూనపరెడ్డి తేజస్వి, పామర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు.

స్క్రాప్ మార్కెట్‌కు స్థలమివ్వండి

● ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

విద్యాధరపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్క్రాప్ ఐరన్ మార్కెట్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని, తగిన స్థలం తమకు కేటాయిస్తే అందులోకి తమ వ్యాపారాలను మార్చుకుంటామని స్టార్ ఓల్డ్ ట్రాక్టర్ స్క్రాప్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఎంపీ కేశినేని శివనాథ్‌కు విన్నవించారు. పశ్చిమలోని గణపతిరావు రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం స్టార్ ఓల్డ్ ట్రాక్టర్ స్క్రాప్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను వారు కలిశారు. ఈసందర్భంగా ఎంపీ చిన్ని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇస్లాంపేట బీఆర్పీ రోడ్డులో దాదాపు 50ఏళ్ల నుంచి స్క్రాప్ ఐరన్ మార్కెట్ ఉందని, ఈ మార్కెట్‌లో దాదాపు 100 షాపులున్నాయన్నారు. రోడ్లపై సామానులు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని వీఎంసీ అధికారులు, పోలీసులు తమ సామగ్రిని తొలగించాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రభుత్వం తమకు స్థలం చూపిస్తే షాపులు అక్కడికి మార్చుకుంటామని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి ఒక మెమోరాండంతో వస్తే ప్రభుత్వంతో మాట్లాడి స్థలం మంజూరయ్యేందుకు కృషి చేస్తానన్నారు. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెసులుబాటు కల్పించాలని అధికారులతో ఎంపీ మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ చాంద్, అబ్దుల్ జలీల్, యూసఫ్ ఖాన్, హబీబుర్రహ్మాన్, అన్సార్, అబ్దుల్ రకీబ్, అబ్దుల్ హది, అబ్దుల్ సలాం, అబ్దుల్ ఖయ్యూం, అల్తాఫ్ హుస్సేన్, మొహమ్మద్ జాబీర్, ఆదం ఖాన్ పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని శివనాథ్‌కు సమస్యలు వివరిస్తున్న స్టార్ ఓల్డ్ ట్రాక్టర్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఎంపీని కలిసిన మాజీ ఎంపీ బాడిగ

మచిలీపట్నం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను ఎన్టీఆర్ భవన్‌లో కలిశారు. ఆయనకు ఎంపీ చిన్ని సాదర స్వాగతం పలికారు. ఎంపీ కేశినేని శివనాథ్‌కు బాడిగ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కాసేపు రాజకీయాలు, తదితర అంశాలపై చర్చించుకున్నారు.

చేతికర్రల పంపిణీ

పక్షవాతంతో నడవలేక ఇబ్బంది పడుతున్న ఇద్దరు బాధితులకు ఎంపీ కేశినేని శివనాథ్ పశ్చిమలోని గణపతిరావు రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం చేతికర్రలు పంపిణీ చేశారు. పక్షవాతానికి గురైన 51వ డివిజన్‌కు చెందిన పొలుసు నాని, 47వ డివిజన్‌కి చెందిన ఎరుపల్లి నారాయణమ్మకు ఈ చేతి కర్రలను ఎంపీ అందజేశారు. పక్షవాతంతో బాధపడుతూ రాలేకపోయిన ఎరుపల్లి నారాయణమ్మ తరుపున ఆమె భర్త రామారావుకి చేతికర్ర అందించారు.

ట్రూ అప్, డౌన్ అంకెల గారడీ ఆపండి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాబూరావు



విద్యుత్ నియంత్రణ మండలి వర్చువల్ విచారణలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాబూరావు

విజయవాడ సిటీ, జులై 9, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, విద్యుత్ పంపిణీ సంస్థలు చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారులపై భారాలు మోపుతున్నారని, వైసీపీ పాలనలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్, తదితర కంపెనీలు అక్రమాలను కూటమి ప్రభుత్వం కప్పిపుచ్చుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు నుంచి విద్యుత్ నియంత్రణ మండలి బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన విచారణలో బాబూరావు గళం విప్పారు. ఆదానీ స్మార్ట్ మీటర్లను ఆపాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వాలు, విద్యుత్ పంపిణీ సంస్థలు మాయాజాలం చేస్తున్నాయని, విద్యుత్ రంగంలోని భారీ కుంభకోణాలపై వెంటనే విచారణ జరపాలని, వైసీపీ ప్రభుత్వ అవినీతిని కూటమి ప్రభుత్వం కప్పిపుచ్చుతోందని మండిపడ్డారు. విద్యుత్ సుంకం పేరుతో యూనిట్‌కు ఆరు పైసలుగా ఉన్న ధరను ఏకంగా 100 పైసలకు పెంచడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కొందరు ఉన్నతాధికారులు, బడా కంపెనీలు కుమ్మక్కై విద్యుత్ పంపిణీ సంస్థలను నిండా ముంచుతున్నారని, నష్టాల భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణులు, మీడియా ప్రముఖులు ఈ అవినీతిని బహిర్గతం చేసినా కూటమి ప్రభుత్వం మౌనం వహించడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించడంతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి నగరంలోని మెడ్‌స్టార్ ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. చీఫ్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బీ విజయచైతన్య ఆధ్వర్యంలో పోలీసులకు గుండె పరీక్షలైన 2డీ ఎకో, ఈసీజీ, కొలెస్ట్రాల్, లివర్, కిడ్నీ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేకంగా నిర్వహించిన షీల్డింగ్ ద షీల్డ్ అనే కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించి మాట్లాడారు. రోజూ వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని, నీరు తాగాలని, 6-7 గంటల నిద్ర ఉండాలని, ఒత్తిడిపై స్వీయ నియంత్రణ ఉండాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని, 6 నుంచి ఏడాదిలోపు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ విజయచైతన్య మాట్లాడుతూ గుండె జబ్బుల కారణంగా ప్రపంచలో అత్యధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



షీల్డింగ్ ద షీల్డ్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విశ్వశాంతి కోసం సైకిల్ సవారీ

● 60 ఏళ్ల వయసులో కర్ణాటక వాసి సాహసం
● ఆరు నెలలుగా దేశాన్ని చుట్టేస్తున్న నాగరాజు గౌడ

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృత్వం, సోదర భావంతో మెలగాలని, నానాటికీ అడుగంటిపోతున్న నీటి వనరులను కాపాడాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే నినాదాలతో కర్ణాటకకు చెందిన 60 ఏళ్ల నాగరాజు గౌడ చేపడుతున్న భారత సైకిల్ యాత్ర విజయవాడ నగరానికి బుధవారం చేరుకుంది. సైకిల్‌కు ఫ్లకార్డులు కట్టుకుని, తలపై కాషాయం చుట్టి, దేశీయ సంప్రదాయ దుస్తులు ధరించి ఈ ఏడాది జనవరి 2న ఢిల్లీలో నాగరాజు ఈ యాత్రను ప్రారంభించారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, వెస్టబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ వరకు కొనసాగింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్, ఆధ్యాత్మిక కేంద్రాలైన వారణాసి, జ్యోతిర్లింగాల వద్ద సైతం తన నినాదాన్ని చాటానన్నారు. జార్ఖండ్‌లోని దట్టమైన అడవులను, పూర్వాంచల్‌లోని కొన్ని ప్రమాదకర పరిస్థితులను దాటుకుని ఈ సాహసయాత్రను కొనసాగిస్తున్నానన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు యాత్ర కొనసాగుతుందని, రోజూ 60 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణిస్తానన్నారు. రాత్రి సమయంలో దేవాలయాలు, ఆశ్రమాల్లో బస చేస్తున్నారు. ఈ యాత్రలో బాలీవుడ్ నటులు సోనూసూద్, మనోజ్ తివారీ, రాజకీయ ప్రముఖులు కేజ్రీవాల్, అఖిలేష్‌యాదవ్, అశోక్ గెహ్లాట్‌ను కలిసినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, పంజాబ్, ఉత్తరాఖండ్ మీదుగా ఢిల్లీ చేరుకుని, అక్కడ యాత్రను ముగిస్తానని చెప్పారు. దేశంలో మానవ సంబంధాలు రోజురోజుకీ సన్నగిల్లుతున్నాయని, కనీసం కొందరిలో అయినా మార్పు తేవాలనే తాను ఈ యాత్ర చేపట్టినట్టు నాగరాజు తెలిపారు. మాతృభాష కన్నడతో పాటు తెలుగు, తమిళ్, హిందీ, ఇంగ్లీష్ భాషలను ఆయన మాట్లాడగలుగుతున్నారు.



ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, లాభాలు

● ఆరుగొలనులో కలెక్టర్ బాలాజీ ● క్షేత్రస్థాయి పరిశీలన, రైతులతో ముఖాముఖి

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రసాయనాలు లేని ఆహారంతో ఆరోగ్యం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల వల్ల లాభాలు పొందవచ్చని రైతులు ఆలోచన చేసి కార్యాచరణ చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. ఆరుగొలనులో కౌలుకు తీసుకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న చలమయ్య పొలంలో నవధాన్యాల పంటను వేరుశాఖల (రూట్ సిస్టం) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగుకయ్యే ఖర్చు, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మొక్కల వేర్లు లోతుగా వెళ్లడం వల్ల భూమి గుల్లబారి తదనంతరం వేసే పంటకు అధిక మోతాదులో భూసారం అందుతుందని సోదాహరణంగా చూపించారు. స్థానిక రైతులు బేతా శేషకుమార్, తుమ్మల బ్రహ్మాజీతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఆర్డీవో గుడివాడ బాలసుబ్రహ్మణ్యం, ప్రకృతి వ్యవసాయ డీపీఎం పార్థసారథి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జే జ్యోతి, తహసీల్దార్ మురళీకృష్ణ, వర్మ పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు.

బాపులపాడు మండలంలోని మెట్టప్రాంతాల్లో ఆయిల్‌పామ్, కొబ్బరి లాంటి తోటలు సాగుచేస్తున్నారని, కోకో లాంటి అంతర పంటల సాగుతో అధికలాభాలు ఆర్జించవచ్చని కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు సూచించారు. రేమల్లెలోని బెజవాడ ఏడుకొండలుకు చెందిన 14 ఎకరాల కొబ్బరితోటలో అంతరపంటగా సాగు చేస్తున్న కోకోను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జే జ్యోతి, డీపీఎం పార్థసారథితో కలిసి పరిశీలించారు. పెట్టుబడి, దిగుబడి, కొనుగోలు వంటి విషయాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మొక్క నాటిన 3 ఏళ్లకు పంట చేతికివస్తుందని, చాక్లెట్ల తయారీతో పాటు యాంటీ డయాబెటిక్ చాక్లెట్ల తయారీకి కోకో పంట వినియోగిస్తున్నారని, ఫ్యాక్టరీ వారే వచ్చి కొనుగోలు చేస్తున్నారన్నారు. మద్దతు ధర తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌వో జోసఫ్ సుందరం, రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, ఏపీవో అశోక్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



మొక్కల వేర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, డీపీఎం పార్థసారథి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ మురళీకృష్ణ, తదితరులు

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సాంకేతిక విద్యాభివృద్ధికి దాతలందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు సూచించారు. రేమల్లె పాఠశాలలో మాక్సిమస్ ఏర్సీ లిమిటెడ్ ప్రతినిధి దేవినేని నన్నారాం సహకారంతో రూ.14లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్, భోజనశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం చాంబర్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మెగా పేరెంట్ మీటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు.

విద్యార్థులతో కలిసి భోజనం

రేమల్లె హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన ప్రారంభించిన భోజనశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ రుచి చూశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తూనే సహపంక్తి భోజనం చేశారు. ఏం చదువుతున్నారు.. పాఠాలు అర్థమయ్యేలా చెపుతున్నారా.. భవిష్యత్తులో ఏమవుతారు.. ప్రతిరోజు భోజనం బాగుంటున్నదా అని ఆరాతీశారు. అనంతరం ఆవరణలో మొక్కను నాటారు. కలపాల రాధాకృష్ణమూర్తి, డీవైఈవో రవికుమార్, ఎంఈవో రాంబాలాసింగ్, హెచ్ఎం లూథర్‌పాల్, విజయ్, ఎస్ఎంసీ చైర్మన్ సొదిమెళ్ల శ్యాం, వడ్లమూని వెంకట కృష్ణారావు, యనమదల సాంబశివరావు పాల్గొన్నారు.

ఎక్కువ మంది రైతులకు వ్యవసాయ పరికరాలు

● ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ పథకం కింద రైతులకు వ్యక్తిగత పనిముట్లను 2025-26లో ఎక్కువ మందికి అందేలా చూడాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆగ్రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరి సమీపంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా ఆగ్రోస్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆగ్రోస్ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో పా టు కోర్టు కేసులు, బకాయిలు, సంస్థ స్థలాల పరిరక్షణ, వ్యవసాయ పరికరా ల అమ్మకాలపై చర్చించారు. ఆగ్రోస్ ఎండీ డిల్లీరావు, జీఎం రాజమోహన్, మేనేజర్ కూర్మారావు, ఎస్ఈ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కోత లేదు: అగ్రి డైరెక్టర్

రాష్ట్రానికి ఎరువుల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కోతలై విధించలేదని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 16.76లక్షల టన్నుల ఎరువులు కేటాయించగా, జూన్ నెలాఖరు నాటికే 5.64లక్షల టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు బుధవారం తెలిపారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ

రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి దృశ్య స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1,2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరిలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పీఎంఏజీవై అమలుకు అప్రైజల్ కమిటీ

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన(పీఎంఏజీవై) పథకం అమలుకు జిల్లా స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కం కన్వర్జెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్/కమిషనర్ చైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈఓ వైస్ చైర్‌పర్సన్‌గాను, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఆర్‌డీఏ పీడీ, మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ, డీఈఓ, డీఎంఅండ్‌హెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్అండ్‌బీ ఎస్ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ/ఈఈ, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఎన్ఐసీ డీఎం, ఐదు పీఎంఏజీవై గ్రామాల నుంచి ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి టెక్నికల్ రిసోర్స్ సపోర్ట్ ఇన్‌స్టిట్యూషన్ నోడల్ అధికారి సభ్యులుగా, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

గుడివాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద వేంచేసి యున్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు జరుపగా రూ.4,33,368లు, స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరస్వామి దేవస్థాన హుండీ ద్వారా రూ.1,68,302లు ఆదాయం సమకూరినట్లు ఆలయాల కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం ఆలయాల తనిఖీదారు ఉయ్యూరు సుధాకర్ , ఆండాళ్ గోష్టి సభ్యులు, కోలాట సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సార్వత్రిక సమ్మె పాక్షికం

● పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకారం ● యథావిధిగా వ్యాపారాలు



గుడివాడలో..

జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె బుధవారం పాక్షికంగా జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు మూతపడ్డాయి, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారు. వాణిజ్య వ్యాపారాలు యథావిధిగా కొనసాగాయి.

గుడివాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : 30 అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, అభివృద్ధి కమిటీల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్‌ల బిగింపును వ్యతిరేకిస్తూ చేపట్టిన గుడివాడ బంద్ పాక్షికంగా జరిగింది. పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులు కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద కార్మికసంఘాలు, ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించాయి. ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్, ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో సమ్మె నిర్వహించారు.

గుడ్లవల్లేరు : కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసనగా బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా గుడ్లవల్లేరులో అంగన్వాడీ వర్కర్స్, ఆశావర్కర్లు, పంచాయతీ వర్కర్లు, తదితరులు సమ్మెలో పాల్గొన్నారు. గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ఎంఅండ్‌కె ప్రధాన రహదారి మీదుగా ప్రధాన కూడలికి ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. శ్రామిక మహిళా కృష్ణాజిల్లా కన్వీనర్ ధనశ్రీ, అమ్మజీ,విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, రమాదేవి, మౌనిక, లక్ష్మి పాల్గొన్నారు.



కూచిపూడిలో..

కూచిపూడి : సమస్యల పరిష్కారం కోరుతూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా మొవ్వలో కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీరాజ్, బిల్డింగ్ వర్కర్స్, మధ్యాహ్న భోజనం, కౌలు రైతు సంఘాల యూనియన్ నేతలు రాజారత్నం, దేవమణి, అరుణ, కొడాలి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, బొల్లా సుబ్రహ్మణ్యం, శీలం నారాయణరావు, పాల్గొన్నారు.

కూచిపూడి: 2019 నుంచి సహకార సంఘాల్లో కొనసాగుతున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, కార్మిక కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సహకార సంఘాల నేతలు సత్యనారాయణ, పింగళి వెంకట రమణలు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సహకార సంఘాల ఉద్యోగులు, కార్యదర్శులు మొవ్వ సహకార బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు.



పామర్రులో..

నందివాడ : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నందివాడలో సీఐటీయూ యూనియన్ మండల అధ్యక్షురాలు రజని ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ వర్కర్స్ ఆశా వర్కర్స్, మిడ్డే మిల్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో నందివాడలో తహసీల్దార్ కార్యాలయం నుంచి నందివాడ బ్యాంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించినట్లు రజని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టారు మేరి కుమార్, సుగుణ కుమారి, వెంకటరమణ, పాల్గొన్నారు.

పామర్రు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఒడుగు గంగాధర్ ప్రసాద్ కోరారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం వివిధ సంఘాల కార్మికులతో పామర్రు శాఖ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పామర్రు అంగన్వాడీల ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉమారాణి, కార్మికసంఘ నాయకులు బి.పద్మజ, నాగసావిత్రి, భూలక్ష్మి, జే.రామస్వామి, రజక సంఘ జిల్లా కార్యదర్శి కె.నాగ భూషణం, రామ్మోహనరావు, పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

పెదపారుపూడి : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పెదపారుపూడిలో అంగన్వాడీ, ఆశా, మిడ్డే మీల్స్ గ్రామపంచాయతీ, స్కూలు ఆయాలు, బిల్డింగ్ వర్కర్స్‌తో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న బిల్డింగ్ యూనియన్ రాష్ట్ర నాయకులు వేము పెదబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడులను రద్దు చేయాలన్నారు. సీఎం చంద్రబాబు ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలకు మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీని వల్ల కార్మిక రంగం తీవ్ర నష్టానికి గురవుతుందని తెలిపారు. వేము వెంకటేశ్వరరావు, డి.రఘు, టి.అబ్రహం, పి.కృష్ణారావు, వాణి, రాజేశ్వరి, విజయ కుమారి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం తోట్లవల్లూరులో సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు ఉమామహేశ్వరి, పీవీకే లక్ష్మీ, టింబర్ డిపో కార్మిక నాయకుడు వల్లూరు శివ నాగ బాబు, ఎం. శివకృష్ణ ఎం. ప్రభాకరరావు, కె. కొండలు బాబు, డేవిడ్‌రాజు, ఏసేబు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో..

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికీ సంక్షేమానికి తీసుకువెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 26,27 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్మికనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యా దీవెన కిట్‌లను పరిశీలించారు. పాఠశాల భవనం మరమ్మతులకు గురికావడంతో విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు రాంబాబు, ప్రసాద్, పాల్గొన్నారు.



వికలాంగురాలి సమస్య వింటున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

కూచిపూడి : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మొవ్వపాలెం, వేములమడ గ్రామాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఓ వికలాంగురాలు తనకు వచ్చే రూ.6వేల పింఛన్‌తోనే కుటుంబం మొత్తం జీవనం సాగిస్తున్నామని, పెన్షన్ రూ.15 వేలకు పెంచాలని ఎమ్మెల్యేకు వివరించారు. పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, తులసీ దాస్, పార్టీ నేతలు శ్రీనివాసరావు, నారాయణరావు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: గుడివాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం రాత్రి మోటూరు, దొండపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● జడ్పీసీఈవో కన్నమనాయుడు

పామర్రు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా స్వీకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కన్నమనాయుడు పిలుపునిచ్చారు. పామర్రు ఒకటో సచివాలయ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ సర్వేలో శానిటేషన్ విభాగం పనితీరు కొంత వెనకంజలో ఉండడం గుర్తించి దాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించే నిమిత్తం ఆయన బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 20వవార్డులోని బాపూజీపేటలో ఇంటింటా తిరుగుతూ ప్రజలనుంచి అభిప్రాయాలను సేకరించారు. గ్రామాల్లో మహిళలు ఇంట్లో తడి, పొడిచెత్త వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించి గ్రామ అభివృద్ధికి సహాయ పడాలన్నారు. జనావాసాల మధ్య పందుల పెంపకం ఉండడంతోపాటు, గుడివాడరోడ్డులో వ్యర్థాలతో పూడుకు పోయిన మురుగు డ్రెయినేజీ పరిశీలించి సంబంధిత అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే మురుగు డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణ దారులకు నోటీసులందించి వాటిని తొలగింపునకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాంధ్రు జ్యోతి, మండల పంచాయతీ విస్తరణాధికారి గుత్తికొండ కిషోర్, పంచాయతి కార్యదర్శి అబ్దుల్ సలీం, శానిటరి ఇన్‌స్పెక్టర్ సుధాకర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఈవో కన్నమ నాయుడు

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

గుడివాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో 36బాధిత కుటుంబాలకు రూ.20.20లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలను అందించినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రికార్డు స్థాయిలో రూ.2.14కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తెలుసుకుని ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు విజయవంతమై పేదవర్గాల ఉన్నతికి చేయూతనిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు నూకాలమ్మ, నాయకులు లింగం ప్రసాద్, నెరుసు కాశీ, నిమ్మగడ్డ సత్యసాయి, పోలాసి ఉమా, గూడూరు సురేంద్ర, సిరిపురపు తులసీరాణీ, మల్లికా బేగం తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు :వడ్లమన్నాడుకు చెందిన కొవ్వి లక్ష్మణరావుకు ముఖ్యమంత్రి సహయనిధి మంజూరు కాగా చెక్కును బుధవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందజేశారు. లక్ష్మణరావుకు ఇటీవల మోకాళ్లకు శస్త్రచికిత్స నిర్వహించగా గ్రామ టీడీపీ నాయకుల సిఫార్సు మేరకు గుడివాడ ఎమ్మెల్యే సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం రూ. 60 వేలు మంజూరైంది. ఈ నగదును లబ్ధిదారుడైన లక్ష్మణరావుకు ఎమ్మెల్యే రాము బుధవారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్లమన్నాడు గ్రామ ఉపసర్పంచ్ గరికపాటి రాంబాబు, గుడివాడ టీడీపీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

● ఎంపీడీవో మల్లేశ్వరి

నందివాడ, జూలై9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సమష్టి కృషి తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో మల్లేశ్వరి పేర్కొన్నారు. వెలుగు పథకం కార్యాలయంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి అమీర్ మీర్జా బాషా ఆధ్వర్యంలో బుధవారం గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలి అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్, పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన రాష్ట్ర సమగ్ర స్వరాజ్య అభియాన్ కార్యచరణ ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహులు ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దార్ కిరణ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశ్వరి

పెదపారుపూడి: పంచాయతీ పురోగతి సూచిక 2.0 మేరకు నిర్ధేశించిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మెట్స్‌లో నింపి సకాలంలో సమర్పించాలని పెదపారుపూడి ఎంపీడీవో జి.విమాదేవి అన్నారు. ఆర్‌జీఎస్ఏ వార్షిక ప్రణాళిక 2025-26 తయారీ కోసం పంచాయతీ పురోగతి సూచిక 2.0 ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం పెదపారుపూడి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. శిక్షకులుగా మోపర్రు కార్యదర్శి పుల్లారావు, డిజిటల్ అసిస్టెంట్ విజయ్ కుమార్ వ్యవహరించారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ఏఈలు రామ్మోహన్, షహనాజ్, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మకు ఆషాఢ సారె నేడు

గుడ్లవల్లేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) :వేమవరం కొండాలమ్మ అమ్మవారికి నేడు గురువారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆషాఢ సారెను తీసుకొని రానున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్లు వీరే..

పామర్రు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది తరువాత త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా మండల పరిధిలో 10 పీఏసీఎస్‌లకుగాను ఆరు మాత్రమే విడుదలయ్యాయి. వాటిలో పామర్రు పీఏసీఎస్ చైర్మన్‌గా చుండ్రు వీర వెంకట సత్యసుబ్బారావు, కనుమూరు పీఏసీఎస్‌కు సప్పా వెంకట బసవరావు, కొమరవోలు పీఏసీఎస్‌కు పోట్లూరి రాజారావు, ఉండ్రపూడికి హేమప్రకాష్, అశోక్ చక్రవర్తి, నిమ్మలూరుకు రాంబాబులు చైర్ పర్సన్లుగా మరో ఇద్దరేసి చొప్పున త్రీమెన్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు గుడివాడ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ వింజిమూరి కృష్ణకాంత్ బుధవారం వెల్లడించారు. మిగిలిన వాటికి త్వరలో నియమకపు ఉత్తర్వులు అందజేయనున్నామన్నారు.

కూచిపూడి : మొవ్వలోని మొవ్వ పాలెం, కూచిపూడి పీఏసీఎస్‌ల చైర్మన్లను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొవ్వ పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా కొనకళ్ల ఏసుప్రభువు, సభ్యులుగా చలమలశెట్టి సుబ్బయ్య, కాట్రగడ్డ శ్రీనివాసరావులను ఎంపిక చేశారు. కూచిపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా దామెర్ల పుష్పావతి, సభ్యులుగా సంగిశెట్టి నాగ భూషణం, లంకపల్లి రంగారావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

గుడివాడ : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందివాడ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలపాలయ్యారు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

పామర్రు : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతోపాటుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలని సీఐ సుభకర్ అన్నారు. బుధవారం బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద రోడ్డు డేంజర్ గుర్తులు కలిగిన డ్రమ్ములను పోలీసులు ఏర్పాటు చేశారు.

విద్యార్థి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

పామర్రు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇంటినుంచి ఎంతో ఉత్సాహంగా పాఠశాలకు బయలుదేరిన పదోతరగతి విద్యార్థి కలపాల జోయల్ రత్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా విచారకరమని, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జోయల్ మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం అతని గ్రామంలోని బల్లిపర్రు ఇంటి వద్దకు తీసుకువచ్చారు. బుధవారం బాలుడి మృతదేహన్ని ఎమ్మెల్యే సందర్శించి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బల్లిపర్రు గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, కలపాల సుధాకర్, టీడీపీ నేతలు వీరంకి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. కొన్నిరోజుల కిందట గుండెపోటుతో మృతిచెందిన ఉపాధ్యాయుడు శీలం కరుణకుమార్ సంతాప సభలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబులు పాల్గొని ఉపాధ్యాయుడి చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దేవరపల్లి రామకోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ శ్రీధర్, అప్పికట్ల కుమార్, గాలీబ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పేకాట శిబిరాలపై దాడులు

తోట్లవల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పాములలంక సమీపంలో ఎంతో కాలంగా గుట్టుగా సాగుతున్న భారీ పేకాట శిబిరంపై పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో 11 మంది జూదరులను పట్టుకుని రూ. 47వేలు నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. జూద క్రీడలకు పాల్పడితే సహించేది లేదని సీఐ హెచ్చరించారు.

కూచిపూడి : వేములమడ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కూచిపూడి ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలియజేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఏవో శివనాగరాణి



రాపర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శివనాగరాణి

పామర్రు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు వరి నారుమడులు సిద్ధం చేసుకునే ముందు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం తోపాటు విత్తన శుద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణి అన్నారు. రాపర్ల, జమిదగ్గుమిల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు ఖరీఫ్‌సాగులో వచ్చిన ఆధునిక సాంకేతిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.

పమిడిముక్కల : ప్రధానమంత్రి పసల్ బీమా యోజనలో భాగంగా పంటలను సాగుచేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి రైతులు, కౌలు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పమిడిముక్కల, పైడికొండలపాలెంలో పర్యటించి వ రినాట్లు, ఇతర పంటలపై అవగాహన కల్పించి పలు సూచనలుచేశారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.గణేశ్‌రెడ్డి, ఏఈవో సునీల్ , తదితరులు పాల్గొన్నారు.



నాగవరప్పాడులో కందుల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ ఎస్.కవిత

గుడివాడ రూరల్ : రైతులు పొలం గట్ల మీద అపరాల విత్తనాలను సాగు చేసుకుని లాభాలు గడించవచ్చునని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.కవిత అన్నారు. బుధవారం నాగవరప్పాడు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, ఏఈవో అనిత, రైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11.30 గంటల నుంచి పన్నెండున్నర వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు 99592 25466కు ఫోన్ చేసి సూచనలు, సలహాలివ్వాలని సూచించారు.

ఆకులమన్నాడు, జక్కంచర్ల పీఏసీఎస్‌లకు చైర్మన్ల నియామకం

గూడూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆకులమన్నాడు, జక్కంచర్ల పీఏసీఎస్‌లకు చైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆకులమన్నాడుకు చైర్మన్‌గా ఎజ్జు శివాజీ, సభ్యులుగా ఎస్.కుమారి, కొరారి నాంచారయ్య, జక్కంచర్లకు చైర్మన్‌గా మత్తి సుబ్రహ్మణ్యం, సభ్యులుగా ఎస్.మేరీహేమలత, అబ్దుల్ ఇనాయతుల్లాను నియమించింది.

పేదల బియ్యం బొక్కిన పేర్ని నానీ..

● మీరా నీతులు చెప్పేది..మంత్రి కొల్లు రవీంద్రపై విమర్శలు చేసేది

● గంజాయి బ్యాచ్‌తో చప్పట్లు కొట్టించుకున్నంత మాత్రాన కిట్టూ హీరో కాలేడు: మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పేదల బియ్యం బొక్కిన మాజీ మంత్రి పేర్ని నాని నీతులు చెప్పడం, మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించడం హాస్యాస్పదమని మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని అన్నారు. బుధవారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. అవినీతికి పాల్పడలేదని చెబుతున్న పేర్ని నాని ముందస్తు బెయిల్ ఎందుకు తెచ్చుకున్నారని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌తో చప్పట్లు కొట్టించుకుంటున్న మాత్రాన పేర్ని కిట్టూ హీరో కాలేడన్నారు. అవాస్తవాలను అలవోకగా చెప్పడంలో పేర్ని నానీ పీహెచ్‌డి చేశారని టీడీపీ బందరు మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ మెడలో వైసీపీ కండువా వేసి పార్టీ కేడర్‌ను తీసుకెళ్లిపోతున్నామని చెప్పడం వింతగా ఉందన్నారు. నగర పాలక సంస్థలో 43 మంది వైసీపీ కార్పొరేటర్లు, మండలంలో 20 మంది సర్పంచ్‌లు ఉన్నప్పటికీ ఆ ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయిందో ఆత్మ విమర్శ చేసుకోవాలని మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఖాజా సూచించారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, తలారి సోమశేఖర్, కాటం మధు, మోకా రాజు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించండి

● అవనిగడ్డ డిపో సిబ్బందితో డీపీటీవో వెంకటేశ్వర్లు



గ్యారేజీని పరిశీలిస్తున్న డీపీటీవో వెంకటేశ్వర్లు

అవనిగడ్డ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవ లందించాలని అవనిగడ్డ డిపో సిబ్బందికి ప్రజా రవాణా జిల్లా అధికారి(డీపీటీవో) కె.వెంకటేశ్వర్లు సూచించారు. అవనిగడ్డ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాల రూములను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. డిపో మేనేజర్ కె.హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు సకాలంలో పూర్తి చేయండి

● అధికారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో డ్రెయినేజీ విభాగం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కృష్ణాపురం, నరసింహాపురంలో డ్రెయినేజీ పనులకు వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని ఎస్‌డీఎంఎఫ్ పనులు, ఓ అండ్ ఎం పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆయన సూచించారు. లింగన్నకోడులో కిక్కిస తొలగింపు, గుండేరు పూడికతీత పనుల తీరును ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. డ్రెయినేజీ ఈఈ బి.కిరణ్‌బాబు, డీఈఈ జె.బాబూనాయక్, ఏఈలు అబ్దుల్ కరీం, చిరంజీవి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు సత్కారం

దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితుడైన జనసేన నేత రాజనాల వీరబాబు బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనను వైస్ చైర్మన్‌గా సిఫారసు చేసిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితుడైన ఎస్టీ నాయకుడు మంగళగిరి శ్రీనివాసరావు కలిసి ధన్యవాదాలు తెలిపారు. జనసేన నాయయులు మత్తి వెంకటేశ్వరరావు, చెన్నగిరి సత్యనారాయణ, బచ్చు శ్రీహరి, కటికల అప్పారావు, మర్రె గంగయ్య, కాగిత రామారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలు సరిచూడండి

● బీఎల్వోలకు డీఆర్వో చంద్రశేఖర్ సూచన



మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖర్

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను సరిచూడాలని, మార్పులు, చేర్పులు చేయాలని బీఎల్వోలకు డీఆర్వో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయ సమావేశపు హాలులో బీఎల్వోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. 'నగర పాలక సంస్థ పరిధిలో 205 పోలింగ్ కేంద్రాల్లో 1,96,000 మంది ఓటర్లు ఉన్నారు. రానున్న నగర పాలక సంస్థ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలను సవరించాలి. నూతన ఓటర్లను నమోదు చేయాలి. మృతిచెందిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలి.' అని డీఆర్వో సూచించారు. ఏఈఆర్వోలు కమిషనర్ బాపిరాజు, వి.నాగభూషణం, మధుసూదనరావు, డీటీ హఫీజా, మాస్టర్ ట్రైనీలు కె.రామశేషారావు, పి.భరద్వాజ్, ఫణికుమార్, రాము పాల్గొన్నారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమారాణి

ఏపీ పీజీ సెట్‌లో శ్రీజకు 4వ ర్యాంక్

అవనిగడ్డ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేసిన దేవనబోయిన శ్రీజకు రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ వచ్చింది. శ్రీజను బుధవారం ప్రిన్సిపాల్ ఉమారాణి, కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

తహసీల్దార్ విజయప్రసాద్‌కు అభినందన

ఘంటసాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ వార్షికోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి తహసీల్దార్ బి.విజయప్రసాద్ అవార్డు అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి రెడ్‌క్రాస్ సంస్థకు అందించిన సహకారం, చేసిన సేవలకు గానూ ఆయనకు ఈ అవార్డు లభించింది. తహసీల్దార్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, టీడీపీ సీనియర్ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కృష్ణామిల్క్ యూనియన్ కార్యవర్గసభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, తెలుగుయువ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఆర్ఐ శ్రీనివాస్, రీ సర్వే డీటీ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.



దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పెడనలో ర్యాలీ చేస్తున్న ఆశ కార్యకర్తలు,



అవనిగడ్డలో సమ్మె చేస్తున్న కార్మిక సంఘాలు, చల్లపల్లి సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష నేతలు, కార్మికులు, ఉద్యోగులు

హక్కులు పరిరక్షించాలి

కార్మికులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, సహకార సంఘాల సిబ్బంది డిమాండ్

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన, పంచాయితీ పారిశుధ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు, రవాణా రంగ కార్మికులు, సహకార సంఘాల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనలు చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని, సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

పెడన/అవనిగడ్డ/చల్లపల్లి/నాగాయలంక/కోడూరు/ఘంటసాల/బంటుమిల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు పెడనలో ప్రదర్శన చేశారు. సీఐటీయూ నాయకులు పంచల నరసింహారావు, గోరు రాజు, వాసా గంగాధరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు విశాలక్షి, సువర్ణకుమారి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కైలా జ్ఞానప్రసాద్, రవి, నందమూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పట్టణంలోని కేడీసీసీ బ్యాంకు ఎదుట పీఏసీఎస్ ఉద్యోగులు ధర్నా చేశారు. బంటుమిల్లిలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, భవన నిర్మాణ, రవాణా రంగ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నిరసన ప్రదర్శన చేశారు. సచివాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. రైతు సంఘం నాయకుడు అజయ్ ఘోష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

అవనిగడ్డ రాజీవ్ గాంధీ సెంటర్‌లో..

కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు కార్మికులకు పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నేతలు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, యాసం శ్రీనివాసరావు, అన్నపరెడ్డి నాగమణి, వెంకటలక్ష్మీ, వై.రమాదేవి పాల్గొన్నారు.

చల్లపల్లిలో భారీ ర్యాలీ

వామపక్షనేత నేతలు, కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్లో మానవహారం ఏర్పాటుచేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. మహమ్మద్ కరీముల్లా, యద్దనపూడి మధు, జన్ను జగన్ పాల్గొన్నారు.

సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగుల మద్దతు

సార్వత్రిక సమ్మెకు సహకార సంఘాల ఉద్యోగులు, కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులు మద్దతు ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. సొసైటీ కార్యదర్శులు తోట కృష్ణారావు, చంద్ర రవికుమార్, ఎస్ఎస్.చక్రపాణి పాల్గొన్నారు. నాగాయలంక కేడీసీసీ బ్యాంక్ వద్ద మండల సహకార సంఘాల సిబ్బంది ధర్నా చేశారు. బ్యాంక్ లావాదేవీలు నిలుపుదల చేసి పూర్తి స్థాయి బంద్ నిర్వహించారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, 2019 తర్వాత నియమించిన వారిని పర్మినెంట్ చేయాలని, పదవీ విరణ వయస్సు 62కు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కేవీ రామాంజనేయులు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టెండరు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోడూరు వంతెన సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ వరకు అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకుడు పోలాబత్తిన మోహనరావు, మత్స్య కార్మిక సంఘం నాయకులు కొప్పనాతి తాతయ్య, మోహన కృష్ణ, రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్ పాల్గొన్నారు.

బ్యాంకులు మూయించిన సీఐటీయూ నేతలు

సీఐటీయూ నేతలు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు ఘంటసాలలోని బ్యాంక్‌లను మూయించారు. బ్యాంక్ సెంటర్ నుంచి సత్రం సెంటర్ వరకు ప్రదర్శన చేసి, సత్రం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పద్మ, సునీత, కనకదుర్గ, పుణ్యవతి, బలే రమేష్, రామచంద్రరావు, శ్రీదేవి, నాగమణి, శ్రీలక్ష్మీ, కుమారి, శైలజ, శివరాణి, రాజ్యలక్ష్మీ, లక్ష్మీ, మానస పాల్గొన్నారు.

అనధికారికంగా మద్యం అమ్మితే చర్యలు

● ఎక్సైజ్ సీఐ రవి హెచ్చరిక

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ స్టేషన్ సీఐ రవి హెచ్చరించారు. బెల్టు షాపుల నియంత్రణ కోసం నియోజకవర్గంలో బుధవారం మచిలీపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్, విజయవాడ, ఉయ్యూరు, మొవ్వ, బంటుమిల్లి, అవనిగడ్డ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు జరిపారని ఆయన తెలిపారు. అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై 13 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారని తెలిపారు. 2,973 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారని పేర్కొన్నారు.

బడ్డీల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

మచిలీపట్నం టౌన్/పెడన, జూలై 9(ఆంధ్రజ్యోతి): బందరులోని షాపులు, బడ్డీల్లో బుధవారం ఏఎస్పీ ఎన్‌వీ నాయుడు, డీఎస్పీ రాజా, సీఐలు ఏసుబాబు, నబీ, పరమేశ్వర్‌లు విస్తృతంగా తనిఖీ చేశారు. గుట్కాలు, పాన్‌మసాలాలు, గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. పెడన బంగ్లా పాఠశాల, భట్లజ్ఞాన కోటయ్య జడ్పీ ఉన్నత పాఠశాలల సమీపంలోని షాపుల్లో బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. గుట్కాలు, ఖైనీలను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది, ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పెడనలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



సీతాయిలంకలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ సీనియర్ నేత బొబ్బా

పెడన, జూలై 9(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సాగిందని, పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 2,3 వార్డుల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు బకాయిలను విడుదల చేయించాలని చేనేత కార్మికులు ఎమ్మెల్యేను కోరారు. సాయినగర్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని రిటైర్డ్ డీఎస్పీ అల్లూరయ్య కోరగా సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గూడూరు రోడ్డులో రైల్వే ఆర్వోబీ కారణంగా తాము నష్టపోకుండా చూడాలని రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు ఎమ్మెల్యేను కోరా రు. టీడీపీ పట్టణాధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, హన్ను, కమ్మగంటి బాబు, బొడ్డు దీక్షానందుడు, అనుముల పూర్ణ, జి.మాధవ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

అవనిగడ్డ: పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సీతాయిలంకలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కర్రా సుధాకర్, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, కంచర్ల ఆనంద్, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కోడూరు: ఏ ఏడాదిలో కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్ సూచించారు. పార్టీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అధ్యక్షతన పార్టీ గ్రామ బాధ్యులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలకు ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావును మండల నాయకులు సత్కరించారు. పూతబోయిన శ్రీనివాసరావు, అప్పికట్ల రవీంద్ర, తోట సాంబయ్య, పిల్లి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

అవనిగడ్డ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): 2030 నాటికి పంచాయతీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించటానికి, 2025-26 పంచాయతీ పురోభివృద్ధి సూచిక(2.0)పై సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లైన్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన ప్రశ్నావళి తయారు చేయాలని ఎంపీడీవో మరియదేవి సూచించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, పీఆర్ ఏఈ సీహెచ్ బ్రహ్మానందబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగత్, ఎంఈవో ఎ.పిచ్చియ్య, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ

చల్లపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) పుట్టినరోజు సందర్భంగా చల్లపల్లిలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నడకుదురు రోడ్డులో గుడారాల్లో నివసిస్తున్న నిరుపేదలకు చిన్నా ఫ్రెండ్ సర్కిల్, జనసైనికులు కలిపి 100 బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. చిన్నాను మండలి వెంకట్రామ్ సన్మానించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకట నరసయ్య పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



టి.కొత్తపాలెంలో భ్రమరాంబ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

మచిలీపట్నం టౌన్/నాగాయలంక, జూలై 9(ఆంధ్రజ్యోతి): భక్తులు బుధవారం అమ్మవార్లకు ఆషాఢ సారెలు సమర్పించారు. మచిలీపట్నం గొడుగుపేటలోని గంగానమ్మకు మహిళలు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. గొడుగుపేట, నిజాంపేట, రాజుపేట, కోనేరుసెంటర్ మీదుగా యాత్ర సాగింది. గరుడసేవా సమితి నిర్వాహకురాలు చిట్టి కుమారి పాల్గొన్నారు. నాగాయలంక మండలం టి.కొత్తపాలెంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు, గ్రామస్థులు సారెను సమర్పించారు. అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

పులిగడ్డలో 104 వైద్య సేవలు

అవనిగడ్డ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో 104 వైద్యసేవలు అందించారు. 67 మందికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు.

క్షయపై అవగాహన అవసరం

క్షయపై అవగాహన కలిగి ఉండాలని ప్రజలకు డాక్టర్ రియాజ్ సూచించారు. టీబీ విభాగం సూపర్‌వైజర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రసన్నకుమార్ రెడ్డీ.. బుద్ధి మార్చుకో

● నియోజకవర్గ తెలుగు మహిళల హెచ్చరిక

అవనిగడ్డ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుద్ధి మార్చుకోవాలని, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ నియోజకవర్గ కమిటీ డిమాండ్ చేసింది. లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాలని హెచ్చరించింది. అవనిగడ్డలో బుధవారం విలేకరుల సమావేశంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే నాగ వెంకట కనకదుర్గ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో మహిళా నేతలు మాట్లాడారు. ప్రసన్నకుమార్ రెడ్డిపై ప్రభుత్వం విచారణ జరిపి, అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. విశ్వనాథపల్లి పాప, అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, ఆకుల సీతామహాలక్ష్మి, అన్నపూర్ణమ్మ, శాంతి పాల్గొన్నారు.

కారు - బైక్ ఢీ..ఇద్దరికి తీవ్ర గాయాలు

కోడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మలుపులో నుంచి వచ్చిన కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కోడూరులో బుధవారం జరిగింది. నాగాయలంక మండలం భావదేవరపల్లి గ్రామానికి చెందని కొప్పుల శోభనాద్రి, చిల్లముంత గౌతమ్ బైక్‌పై కోడూరుకు వచ్చారు. వీరు పని ముగించుకుని భావదేవరపల్లి వెళ్తుండగా, సబ్ స్టేషన్ పక్కన ఉన్న మలుపులో నుంచి వస్తున్న కారు ఆకస్మాత్తుగా రావడంతో ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న శోభనాద్రి, శ్రీనాథ్ తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని కోడూరు పోలీసులు పరిశీలించారు.



కంటికి శస్త్రచికిత్స చేయించుకుని డిశ్చార్జ్ అవుతున్న వారికి మొక్కలు పంపిణీ చేసిన సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, వైద్యులు

వినూత్నంగా మొక్కల పంపిణీ

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వనం-మనం కార్యక్రమంలో భాగంగా సర్వజన ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ ఆశాలత బుధవారం వినూత్నరీతిలో మొక్కలు పంపిణీ చేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కంటి శస్త్రచికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయిన వారికి ఆమె మొక్కలు పంపిణీ చేశారు. ఆర్ఎంవో నిరంజన్, వైద్యులు పాల్గొన్నారు.

పది రోజుల్లోగా అభ్యంతరాలు తెలపండి

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నార్త్ మండల పరిధిలోని బ్రహ్మపురం, భాస్కరపురం, మాచవరంలో ప్రభుత్వ ఉద్యోగులకు మార్కెట్ వాల్యూ కింద భూములను అసైన్ చేశారని తహసీల్దార్ నాగభూషణం మీడియాకు తెలిపారు. ఇవి నిషేధిత భూముల కింద ఉన్నాయని, సెక్షన్ 22 ఏ నుంచివాటిని తొలగించేందుకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన తెలిపారు.

పట్టాభి స్మారక భవనానికి అనుమతి ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి శుక్రవారం నిర్వహించే మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో పట్టాభి స్మారక భవనానికి అనుమతులు మంజూరు చేయాలని బీజేపీ నాయకుడు ధూళిపాల శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. గొడుగుపేటలోని కూనపరెడ్డి సేవాట్రస్టు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సూరిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.